



# అవాక్కయ్యాను

అర్జెంటుగా డబ్బులు అవసరమొచ్చి కడప సెవెన్‌రోడ్స్ సెంటర్‌లో ఉన్న స్టేట్‌బ్యాంక్ ఏ.టి.ఎం.కు వెళ్లాను. అక్కడ వైకుంఠపాళిలా పెద్ద పాములాంటి క్యూ చూసి అవాక్కయ్యాను. అవాక్కంటే గుర్తొచ్చింది పాపం! నా భార్యామణి సోమవారం నుండి శుక్రవారం వరకు టీవీలో వచ్చే 'అవాక్కయ్యారా' ప్రోగ్రామ్ మధ్యాహ్నం పన్నెండు నుంచి గంట సేపు కదలకుండా కూర్చుని చూస్తూ ముక్కోటి దేవతలకు మొక్కిన యాంకరక్క నుండి ఫోన్ కలవక ప్రోగ్రామ్ చివరలో అవాక్కవుతూనే ఉంది. అంతెందుకు? ఇండియా టీము క్రికెట్ మాచ్ గెలిచిందంటే మనమంతా అవాక్కవ్వడం లేదా! అదన్న మాట!

లంచ్‌టైమ్ కదా.. పెద్దగా జనాలు ఉండరులే... ఇలా వెళ్లి అలా రావచ్చనుకుని వస్తే కథేంటి ఇలా అడ్డం తిరిగింది? ఎందుకు తిరగదూ? నా లాగే ఆలోచించే వాళ్లుండరా ఏంటి? ఈ క్యూలో నిల్చుంటే నా చాన్స్ వచ్చేసరికి ఎన్ని యుగాలవుతుందో. అసలే ఎండ వాయించేస్తోంది. ఆకలి దంచేస్తోంది. అందుకని దూరంగా ఉన్న ఇంకో ఏ.టి.యం. ట్రై చేద్దామని వెళ్లాను. కానీ అక్కడ కూడా ఫారిన్ పాము అనకొండంత క్యూ ఉంది! ఇంకెక్కడికి పోవాలి? ఇక లాభం లేదు ఇలా అటూ ఇటూ ఎండకు తిరుగుతుంటే ఏ.టి.యమ్.కు కాదు డైరెక్టుగా రిమ్స్‌లో ఐ.సి.యు.కు సెలక్టయ్యే ప్రమాదం హై. సో.. అక్కడే బుద్ధిగా క్యూలో సెటిలయ్యాను. ముప్పావుగంట తర్వాత డోర్ దగ్గరకొచ్చాను. లోపల కూడా చిన్న పామంత క్యూ ఉంది. మళ్లీ అవాక్కూ! ఏంటి ఈ రోజు అంతా, అవాక్కేనా? అరె! గ్లాసు డోర్ మీద 'వన్.. అట్ ఎ టైమ్' అని రెడ్ లెటర్స్‌తో క్లియర్‌గా రాసి ఉన్నా అంతమంది లోపలకి దూరారేంటి? ఛ..ఛ.. ఒక్కరికి కూడా ఏమాత్రం సివిక్ సెన్స్, క్రమశిక్షణ లేనే లేవు అని అపరిచితుడు లెవెల్లో ఫీలయి.. ఏమైనా సరే లోపలున్న వాళ్లందరూ బయటకు వచ్చాక గానీ లోపలకి పోకూడదని ఆగాను.

ఇంతలో క్యూ చివర్లో ఉన్న ఒక సారువాడు "సార్.. లోపలికెళ్లండి ఫర్వాలేదు.. ఎండ మండుతోందిక్కడ" అని అరచినంత పన్జేశాడు. అసలు సంగతేవిటంటే బయట క్యూ సగం ఎండలో సగం నీడలో ఉంది. నేను లోపలికి వెళ్తే అందసారువాడు నీడలోకి వస్తాడు. అదన్న మాట (మీరు లోపలికి వెళ్తారా మేమే ఆ పని చెయ్యాల్నా అన్న వార్నింగ్ కూడా ఉంది). ఎందుకొచ్చిన తంటా అని అయిష్టంగానే లోపలికెళ్లాను. లోపల చిన్న పాము తోక స్థానంలో నిలబడ్డాను. నిజం చెప్పాలంటే లోపల చల్లగా హాయిగా ఉంది. ఏ.సి. కదా..

నా వంతొచ్చాక క్యాష్ డ్రా చేసి, పనైపోయింది కాబట్టి ఇదే ఛాన్సని చిన్న క్లాసు పీకుదామని "లోపల ఒక్కరు మాత్రమే ఉండాలని క్లియర్‌గా రాశారు కదా! ఇలా అందరూ లోపలికి వస్తే ఇక ప్రైవసీ ఏముంది? పిన్ నెంబరు, ఎంత డ్రా చేసింది అందరికీ తెలిసిపోతుంది కదా!" అన్నాను. దీనికి రిప్లై కూడా రాదులే అనుకున్నా. చిన్న హీరోలా ఫోజు పెట్టాను కూడా. కానీ! ముందే చెప్పాను కదా ఈ రోజంతా అవాక్కేనని... తపీమని ఒకసారువాడు "బయట ఎండ కదా.. లోపల ఏ.సి. ఉంది కాబట్టి వచ్చారులెండి. అంతమాత్రాన కొంపలేం మునగవ్. అయినా మీ పిన్ నెంబరు మాకు తెలిసినంత మాత్రాన ఏమవుతుంది సార్? కార్డు మీ దగ్గరే ఉంటుంది కదా! ఇక్కడికొచ్చిన వాళ్లు ఎప్పుడెప్పుడు క్యాష్ డ్రా చేసుకుని పోదామా అన్న హడావుడిలో ఉంటారు గానీ, వాడి పిన్ నెంబరెంత? వీడిదెంత అని పట్టించుకునే టైమెక్కడుంది? ఇక క్యాష్ విషయం అంటారా మాగ్జిమమ్ పదిహేను వేలే కదా డ్రా చేసేది" అన్నాడు.

అంతేనా... అవాక్కుమీద అవాక్కు చూడండి. చివర్లో కొసమెరుపు....

"సార్ ఒక చిన్న మాట.. మీ పిన్ నెంబరు సీక్రెట్‌గా ఉంచుకోవాల్సింది మా నుంచి కాదు మీ ఇంట్లో వాళ్ల నుంచి. అనగా మీ భార్య, పుత్రరత్నాలు, అన్నదమ్ములు, బామ్మరుదులు వగైరా వగైరా. అసలు డేంజరు వాళ్ల నుంచే" అన్నాడు నవ్వుతూ.

ఔనుగదా.. జీవిత సత్యం చెప్పారు అని నేను స్పోర్టివ్‌గా తీసుకుని వచ్చేశాను.

-చోరగుడి మల్లికార్జున శర్మ (మామిళ్లగూడెం)

ooo

శలవురోజు. ఇంట్లోనే ఉన్నాను. కొద్దిసేపటి క్రితం పరమేశ్వరరావు గారు ఆటో దిగి, ఎదురింట్లోకి వెళ్లారు. ఏం జరిగిందో... రావుగారి గొంతు గట్టిగా వినవచ్చింది. మరికొద్ది సేపట్లో ఎర్రబడిన ముఖంతో రావు గారు మా ఇంట్లో ప్రవేశించారు.

ఆయన ఒరిస్సాలో పనిచేసి రిటైరయినారు. ఎదురిల్లు వారి సొంత ఇల్లు. సొంత ఇంట్లో శేషజీవితం గడపాలని ఆశ.

రావుగారింట్లో అద్దెకున్నాయన మీద నాకు సద్భావం లేదు. ప్రతీవారితో ఏదో ఒక పేచీ, వాదన వేసుకుంటూ కనిపించేవారు.


దూరపు ఉద్యోగం కాబట్టి రావుగారు ఆయన ఊసు పట్టించుకునే వారు కాదు. అద్దె పెంచమని గానీ, ఖాళీ

చేయమని కానీ ఒత్తిడి లేదు. అద్దెకున్నా యన నిశ్చింతగా ఉన్నాడు.

ఇప్పుడు రిటైరయి, ఖాళీ చేయమని ఆర్నెల్లుగా తిరుగుతున్నా స్పందన లేదు. అరవడం, గొంతునొప్పి మిగిలింది రావుగారికి.

రావుగారిని ఆహ్వానించాను. మా ఆవిడ అందించిన ఫిల్టరు కాఫీ తాగుతూ తన ఆవేదన వెలిబుచ్చనారంభించారు రావుగారు ఆవేశంగా.

# కొత్తపాఠం



"చూశారా, ఎంత దుర్మార్గమో. రిటై రయిన మరుక్షణమే ఇల్లు అప్పచెబుతా నన్న పెద్ద మనిషి ఆరు నెలలుగా అద్దె ఇంట్లో బాధపడుతూ తిరుగుతున్నా, మొండి సమాధానాలు ఇస్తున్నాడు. తగిన ఇంటికోసం వెదుకుతున్నాడట. ఎంత కాలం పడుతుందో చెప్పలేడట. అంతవ రకు ఆగాలట. నమ్మించి ఎలా మోసం చేస్తున్నాడో చూడండి!"

"నమ్మిన వారినే గదా మోసం చేసేది. పోనీ లాయర్ని సంప్రదించలేకపో యారా" అన్నాను.

"అదీ జరిగింది. విషయం ఒక కొలిక్కి రావడానికి సంవత్సరాలు పదు తుందట"

"పని వేగంగా జరిగే మార్గం లేదా!" నా సాను భూతి.

"కోర్టు చేతిలో పడ్డాక మరేం దారి ఉంటుంది. అంతవరకు అద్దె ఇంట్లో బాధ పడుతూ ఉండవల సిందే" అన్నారు నిస్పృహగా. ఆ మాటా, ఈ మాటా అనంతరం రావుగారు బరువుగా నిష్క్రమించారు.

★ ★ ★

తరువాత నాకు బదిలీ అయి, సంవత్సరం వరకు రావడం పడలేదు. అద్దెకిచ్చిన ఇంటికి సంబంధించిన పనిబడి వచ్చాను.

ఎదురిల్లు రీమోడలై అందంగా ముద్దులొలుకుతూ కనబడింది.

గేటుప్రక్క పెద్ద అక్షరాలతో రావుగారి నేమ్ బోర్డు!

లోపల నుంచి నన్ను చూశారు కాబోలు - సంభ్రమంగా వచ్చి, నవ్వుతూ చేయి పట్టుకుని లోనికి తీసుకెళ్లారు. ఉచిత సత్కారాలు జరిగాయి.

"కోర్టు కేసు వేగంగా తేలిపోయిందే" అన్నాను. "మీ లాయరు సమర్థుడే" కితా బిచ్చాను.

"సమర్థుడన్నమాట నిజమే. కేసు పరి ష్కారమయ్యే వరకు అద్దె ప్రతి నెలా కోర్టులో జమచేయమని అతనికి ఆర్డర్ జారీ చేసింది"

"మరి"


"ఇది కేవలం టెనెంట్ మీద ఒత్తిడి పెంచడానికే నట. వ్యవహారం ఈ విధంగా త్వరలో పరిష్కరింపబడ దంటూ, మా లాయరు మరో అద్భుతమైన పథకాన్ని శ్రీకారం నుంచి శ్రీరస్తు వరకు నడిపించాడు" అన్నారు ఆనందంగా అలుపు తీసుకొందుకు కాస్త ఆగి.

వింటున్నాను.

"అద్దెకుంటున్నాయన మన రాష్ట్ర సర్వీసులో ఉన్నాడు. హైదరాబాద్‌లో వాళ్ల డైరెక్టరేట్ నుంచి ట్రాన్స్ ఫర్ ఆర్డర్‌లు తెప్పించాడు తన జూనియరైన యువ లాయర్‌ను పంపించి. అతనికి మంచి కాంటాక్ట్స్ ఉన్నా యట. డబ్బు బాగానే ఖర్చయిందనుకోండి"

"దాంతో ఖాళీ చేసేశాడా?" నా అమాయకపు ప్రశ్న.

"లేదు. పంతానికి ఫేమిలీ నిక్కడే ఉంచి, కొత్త జాగాలో వెళ్లి చేరాడు. అక్కడ అద్దె, ఇక్కడ అద్దె, వేరే చోట పిల్లల చదువులు, ఇక్కడకు వచ్చినపుడల్లా ప్రయాణ ఖర్చులు, తలకు మించిన భారం కాగా గప్‌చి ప్‌గా ఖాళీ చేసి వెళ్లిపోయాడు" అన్నారు రావుగారు మందహాసం చేస్తూ.




"నేనూ త్వరలో రిటైరు కాబోతున్నాను. మా ఇల్లూ ఖాళీ కావాలి. మా టెనెంటుకీ రహ హస్యం చెప్పకండి. జాగ్రత్త పడిపో తాడు"

"మీ టెనెంటు మంచివాడే" రావుగా రన్నారు.

"మంచి చెడ్డలు సమయం వస్తేనే కదండి తెలిసేది. మీకు అనుభవమయి నట్టు" అని జోడించాను నవ్వుతూ.

క్రొత్త పాఠం నేర్చుకున్నానీ రోజు... జీవిత సందర్భాలన్నిటికీ పనికి వచ్చే కాలానుగుణమైన పాఠం!

-బి.ఎస్.ఎన్.మూర్తి

(విజయనగరం)